క్లుప్తంగా

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లోని వడ్డెర కాలనీ బతుకమ్మబండకు వెళ్లే దారిలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై సాయిబాబు తెలిపారు. మృతి చెందిన వ్యక్తి తాపీమేస్త్రీగా అనుమానం వ్యక్తం చేశారు. మృతుడు సుమారు(48) సంవత్సరాల వయస్సు కలిగి ఉంటాడని, 5.5ఎత్తు, బ్లూ కలర్ జీన్‌పాయింట్, కాఫీ, గోధుమ కలర్ చొక్కా వేసుకొని ఉన్నట్లు వివరించారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు స్థానిక పోలీస్‌స్టేషన్ లేదా 8712625131 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు. మృతదేహాన్ని హుజూరాబాద్ మార్చురీలో ఉంచినట్లు ఆయన తెలిపారు.

చికిత్స పొందుతున్న వృద్ధుడి మృతి

ఆత్మకూరు : కుమారులు తన మాట వినడం లేదని మనస్తాపంతో పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతున్న వ్యక్తి గురువారం మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన తనుగుల పైడిద్ద(60) తన కుమారులు ఇంటి స్థలం పంపకం విషయంలో తనకు ఇష్టం లేకున్నా పెద్దమనుషుల వద్దకు వెళ్తామని చెప్పారు. దీంతో మనస్తాపం చెందిన పైడిద్ద బుధవారం పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతుని భార్య గోపమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా

నడికూడ : మండలంలోని కంఠాత్మకూర్‌లో జరిగే సమ్మక్క–సారలమ్మ మినీ జాతరకు వెళ్లి వస్తున్న ట్రాక్టర్ బోల్తా పడి ఒకరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన కంఠాత్మకూర్ శివారులో గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల తెలిపిన ప్రకారం.. మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన నక్క కృష్ణస్వామి కుటుంబ సభ్యులతో జాతరకు వచ్చి మొక్కులు చెల్లించుకొని అనంతరం కుటుంబ సభ్యులతో ట్రాక్టర్‌లో బయటుదేరారు. అదుపుతప్పిన ట్రాక్టర్ బోల్తా పడింది. ట్రాక్టర్‌లో ప్రయాణిస్తున్న సరోజకు గాయాలయ్యాయి.

పర్సు అపహరణ

శాయంపేట : ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తమ బంధువుని చూసేందుకు వెళ్తున్న వ్యక్తి పర్సు పడిపోయింది. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. పరకాల మండలం పోచారం గ్రామానికి చెందిన కొలిపాక చేరాలు తన తమ్ముడి భార్య మమత వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. ఆమె కూతుళ్లు చేరాలు వద్ద ఉండడంతో చిన్నపాప ఏడుస్తుంది. తల్లి వద్దకు తీసుకెళ్లేందుకు చేరాలు దంపతులు పిల్లలను తీసుకొని బుధవారం సాయంత్రం సూరంపేట జెండా వద్దకు వచ్చి బస్సు ఎక్కారు. కండక్టర్ టికెట్‌కు డబ్బులు అడగడంతో పర్సు చూడగా లేదు. దీంతో జెండాగద్దె వద్దకు వచ్చి వెతుకగా కనిపించలేదు. అందులో రెండు బంగారు చైన్లు, రెండు చేతి ఉంగరాలు, ఐదు తులాల వెండి పట్టీలతో పాటు రూ. 8వేల నగదు ఉన్నట్లు బాధితుడు ఫిర్యాదు ఇచ్చినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జాతీయ సదస్సులో మార్నేని రవీందర్‌రావు



హన్మకొండ : నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ స్టేట్ కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ ఆధ్వర్యంలో బెంగళూరులో జరుగుతున్న రీజినల్ కన్సల్టేషన్ వర్క్‌షాప్ విత్ రూరల్ కోఆపరేటివ్ బ్యాంక్ ఆన్ మేజర్స్ టు ఎక్స్పాండ్ బిజినెస్ గ్రోత్ డ్యూరింగ్ ద అమృత్ కాల్ (2022–2047)లో వరంగల్ డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు పాల్గొన్నారు. కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం శివకుమార్, కర్ణాటక సహకార శాఖ మంత్రి కె.ఎస్.రాజన్న ప్రసంగించా రు. చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, భీమ సుబ్ర హ్మణ్యం, ప్రశాంత్‌సిక్రి, వజీర్‌సుల్తాన్ పాల్గొన్నారు.

రవీందర్‌కు డాక్టరేట్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ తెలుగు విభాగం పరిశోధకుడు తాడూరి రవీందర్‌కు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. జగిత్యాలకు చెందిన సుప్రసిద్ధ కథా రచయిత కేవీ.నరేందర్ రచనలు – పరిశీలన అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి తాడూరి రవీందర్‌కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ నర్సింహాచారి తెలిపారు. తెలుగు విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ పంతంగి వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో రవీందర్ తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

ఎల్కతుర్తి : ఎత్తుబెల్లం సమర్పిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్



ఆత్మకూరు : జాతరను సీసీటీవీ ఫుటేజీల్లో పర్యవేక్షిస్తున్న డీసీపీ రవీందర్



ఆత్మకూరు : అగ్రంపహాడ్‌లో సమ్మక్కను గద్దెపై ప్రతిష్ఠిస్తున్న పూజారులు



గద్దెపై కొలువుదీరిన సమ్మక్క

- మేళతాళలు, డోలువాయిద్యాల నడుమ గద్దెకు చేరిన సమ్మక్క
- తల్లిరాకతో ఊపందుకున్న మినీ జాతరలు
- మొక్కులు సమర్పించిన మంత్రి ప్రభాకర్, ప్రముఖులు



కమలాపూర్ : కంక వనం తీసుకెళ్తున్న పూజారులు



ఆత్మకూరు : ఎత్తుబెల్లం సమర్పిస్తున్న బాలకిశోర్‌రెడ్డి

జిల్లా వ్యాప్తంగా ప్రారంభమైన మినీ జాతరలు ఊపందుకున్నాయి. గురువారం వరాల తల్లి సమ్మక్క గద్దెకు చేరడంతో భక్తులు మొక్కులు చెల్లించేందుకు సన్నద్ధం అయ్యారు.

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల్లోని ముల్కనూర్, కొత్తకొండ, దామెర గ్రామాల్లోని సమీప ఆలయ ప్రాంగణం (చిలకలగట్టు) నుంచి అమ్మవారికి వరాహం, మేకను బలిఇచ్చి ఆలయ పూజారులు మేళతాళలు, డోలువాయిద్యాల నడుమ శివసత్తులు పూనకాలతో తూలతూగుతూ తల్లి సమ్మక్కను గద్దె వద్దకు తీసుకొచ్చి ప్రతిష్ఠించారు. భక్తులు పెద్దఎత్తున అమ్మవార్లను దర్శించుకొని చీర, సారే, కొబ్బరికాయ, బెల్లం సమర్పించనున్నారు. పూజారులు మద్దే భూమయ్య, బోదె నర్సింహరాజు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మొక్కులు చెల్లించిన మంత్రి

భీమదేవరపల్లి మండలం ముల్కనూర్, కొత్తకొండతో పాటు ఎల్కతుర్తి మండలం దామెర గ్రామాల్లోని సమ్మక్క–సారలమ్మ వనదేవతలను రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖమంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ గురువారం దర్శించుకున్నారు. కొబ్బరికాయ కొట్టి, బెల్లం సమర్పించి మొక్కులు చెల్లించారు. తెలంగాణ ప్రజలు సుఖసంతోషాలతో నిండునూరేళ్ళు ఆయురారోగ్యాలతో ఉండేలా చూడు తల్లి అంటూ అమ్మవార్లను వేడుకున్నట్లు ఆయన తెలిపారు. మేడారం జాతరకు కేంద్ర ప్రభుత్వం జాతీయహోదా కల్పించాలని ఆయన కోరారు. ఎంపీడీఓలు విజయ్‌కుమార్, వీరేశం, ఎంపీఓలు రవికుమార్, నాగరాజు ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి, నాయకులు బొమ్మనపల్లి అశోక్‌రెడ్డి, సుకినె సంతాజీ, మాజీ సర్పంచ్ చల్లా రవీందర్‌రెడ్డి, చల్లా రమణారెడ్డి, గోలి రాజేశ్వర్‌రావు, బాబురావు, రవీందర్, స్వరూప, గోపి, సమ్మయ్య జాతర కమిటీ చైర్మన్ ఠాగూర్ రామ్‌సింగ్, వీరస్వామి, పూజారులు భూమయ్య, నర్సింహరాజు ఉన్నారు.

శాయంపేట : మండలంలోని జోగంపల్లి గ్రామంలోని సమ్మక్క–సారలమ్మ మినీ జాతరను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు గురువారం సందర్శించారు. సమ్మక్క–సారలమ్మను దర్శించుకొని మొక్కులు చెల్లించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కాంగ్రెస్ మండల పార్టీ మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి, ఎంపీటీసీ ఐలయ్య, పరకాల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు రవి, కుమారస్వామి, లక్ష్మీనారాయణ, డీటీ రెడ్డి, రవీందర్, శంకర్, ఈశ్వర్, వలిహైదర్, రమేష్ పాల్గొన్నారు.

వేలేరు : మండలంలోని పీచర, ఎర్రబెల్లి గ్రామాల్లో సమ్మక్క–సారలమ్మ మినీ జాతర అంగరంగ వైభవంగా జరుగుతోంది. పీచరలో స్టేషన్ ఘన్‌పూర్, జనగామ ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ సింగపురం ఇందిర, ఎర్రబెల్లి గ్రామంలో డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

కమలాపూర్ : మండల కేంద్రంతోపాటు కన్నూరు, మాదన్నపేట, మర్రిపల్లిగూడెం గ్రామాల్లోని సమ్మక్క–సారలమ్మ మినీ జాతరలో గురువారం సమ్మక్క తల్లి గద్దెపైకి చేరుకుంది. పూజారులు కంక వనంను డప్పుచప్పుళ్ల నడుమ గద్దెపైన ప్రతిష్ఠించారు. భక్తులు వివిధ గ్రామాల నుంచి ఎడ్లబండ్లు, ఆటోలు, జీపులు ద్వారా తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటున్నారు. కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఒడితల ప్రణవ్ సమ్మక్క– సారలమ్మను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.



ఆత్మకూరు : అగ్రంపహాడ్ జాతరలో సమ్మక్కతల్లిని గద్దె వద్దకు తీసుకొస్తున్న పూజారులు

ఆత్మకూరు : మండలంలోని అగ్రంపహాడ్ సమ్మక్క–సారలమ్మ జాతరలో గురువారం సమ్మక్క ఆగమనం జరిగింది. భక్తజన కోలాహలం నడుమ సమ్మక్కతల్లి గద్దెకు చేరింది. అగ్రంపహాడ్ గ్రామంలోని సమ్మక్క పూజారి గోనెల సారంగపాణి ఇంటి నుంచి పూజారులు వెంకన్న, సాంబశివరావు ప్రత్యేక పూజలు చేసి సమ్మక్క తల్లిని తీసుకువచ్చారు. దారి పొడవునా భక్తులు నీరాజనం పలికారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి దంపతులు సమ్మక్క తల్లిని తీసుకొచ్చే క్రమంలో పూజారి ఇంట్లో చీర, సారె సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆర్డీఓ శ్రీనివాస్, డీసీపీ రవీందర్, ఏసీపీ కిశోర్‌కుమార్, సీఐ లు సంతోష్, రవిరాజు, రవికుమార్, జెడ్పీటీసీ రాధిక, జాతర చైర్మన్ రమేష్ మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే అగ్రంపహాడ్ సమ్మక్క–సారలమ్మ జాతరలో సొంత ఖర్చులతో స్టీల్ రెయిలింగ్, లైటింగ్స్, ఎల్ఈడీ టీవీ అందించిన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు బాలకిశోర్‌రెడ్డి ఎత్తబెల్లం సమర్పించారు.





వేలేరు : అమ్మవార్లను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి, డీసీసీబీ మాజీ చైర్మన్ రాఘవరెడ్డి

సమ్మక్క, సారలమ్మ దీవెనలతో రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు. జాతర ఉత్సవ కమిటీ చైర్మన్లు, డైరెక్టర్లు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



కమలాపూర్ : మొక్కులు చెల్లిస్తున్న ప్రణవ్



వేలేరు : మొక్కుతున్న ఎమ్మెల్యే పల్లా



వేలేరు : మొక్కులు చెల్లిస్తున్న ఇందిర



ఆత్మకూరు : చీరసారె సమర్పిస్తున్న ఎమ్మెల్యే రేవూరి



శాయంపేట : మొక్కులు చెల్లిస్తున్న ఎమ్మెల్యే గండ్ర

కష్టపడే క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్

- డీఎంహెచ్ఓ సాంబశివరావు
- వరంగల్ క్రికెట్ అండర్–14 జట్టు ఎంపిక



అండర్ -14 క్రికెట్ జట్టుకు క్రీడాకారులను ఎంపిక చేస్తున్న సెలక్షన్ కమిటీ

హన్మకొండ: కష్టపడి క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని హనుమకొండ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.సాంబశివరావు అన్నారు. గురువారం హనుమకొండలోని సెయింట్ పీటర్స్ సెంట్రల్ పబ్లిక్ స్కూల్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా అండర్–14 క్రికెట్ జట్టు క్రీడాకారుల ఎంపిక జరిగింది. ఈ ప్రారంభ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంకిత భావం, కష్టపడే తత్వం, పట్టుదల ఉంటే ఉన్నత స్థాయికి చేరుకోగలరని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, మానసిక, శారీరక అభివృద్ధికి క్రీడలు దోహదపడతాయని చెప్పారు. వరంగల్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈనెల 26న జడ్చర్లలో జరిగే రాష్ట్ర స్థాయి అండర్–14 పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో సెయింట్ పీటర్స్ విద్యాసంస్థల కరస్పాండెంట్ నారాయణ రెడ్డి, క్రికెట్ అసోసియేషన్ వరంగల్ ఉమ్మడి జిల్లా మాజీ జనరల్ సెక్రటరీ ఉదయభానురావు, కోదండపాణి, బండారి ప్రభాకర్, మహమ్మద్ అఫ్జల్, అస్లాం, మట్టెడ కుమార్, మజార్, సుమన్, చైతన్య, శంకర్, అరుణ్ తదితరులు

అమరధామం అభివృద్ధికి నిధులు కేటాయించాలి

- వయోవృద్ధుల సంక్షేమ సంఘం సభ్యుల వినతి



కమిషనర్‌ను సన్మానిస్తున్న సంఘం సభ్యులు

పరకాల: మరో జలియన్ వాలాబాగ్ ఘటనకు గుర్తుగా పరకాల పట్టణంలో నిర్మించిన అమరధామన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి నిధులు కేటాయించాలని వయోవృద్ధుల సంక్షేమ సంఘం సభ్యులు కోరారు. ఈ మేరకు పరకాల మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన నర్సింహను గురువారం వారు సన్మానించారు. ఈ సందర్భంగా అమరధామం సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. నిజాం పాలన నుంచి విముక్తి కోసం నాడు పరకాల ప్రజలు చేసిన వీరోచిత పోరాటానికి చిహ్నంగా నిర్మించిన అమరధామం విగ్రహాలు రంగులు వెలిసిపోవడంతో పాటు పునాది గోడలకు పగుళ్లు ఏర్పాడ్డాయని తెలిపారు. అలాగే ఓపెన్ జిమ్ మరమ్మతుకు వచ్చిందని, పార్కులో పచ్చదనం లేక సందర్శకులను ఆకట్టుకోలేకపోతున్నదని వివరించారు. మున్సిపల్ నుంచి నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ సొసైటీ పరకాల గౌరవ అధ్యక్షుడు బూసి ప్రభాకర్‌రెడ్డి, అధ్యక్షుడు రేపాల నర్సింహరాములు, ప్రధాన కార్యదర్శి కోడెపాక సమ్మయ్య, కోశాధికారి ఎడ్ల సుధాకర్, సహాయ కార్యదర్శి బాణాల మొగిలయ్య, ఉపాధ్యక్షుడు పొరండ్ల కైలాసం, కార్యవర్గ సభ్యులు రేగూరి రాఘవరెడ్డి, ముదురుకోళ్ల సంపత్ పాల్గొన్నారు.

ఆర్టీసీకి మేడారం భక్తుల తాకిడి

- ఒక్కరోజే తరలిన 8వేల మంది



మేడారం వెళ్లే బస్సులు ఎక్కుతున్న ప్రజలు

పరకాల : మేడారం సమ్మక్క–సారలమ్మ దేవతలు గద్దెపైకి చేరుకోవడంతో మేడారానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివెళ్తున్నారు. ఒక్క పరకాల డిపో నుంచి ఏర్పాటు చేసిన 226 బస్సులతో గురువారం ఒక్కరోజునే 8 వేల మంది భక్తులు మేడారానికి తరలివెళ్లారు. దింతో గత నాలుగు రోజులుగా పరకాల ఆర్టీసీ డిపోకు కేటాయించిన బస్సులు 410 ట్రిప్పులతో మొత్తం 18 వేల 450మంది భక్తులు తరలివెళ్లినట్లు ఆర్టీసీ అధికారుల లెక్కలు వేస్తున్నారు. మరో రెండు రోజుల్లో 7వేల మంది భక్తులు తరలివెళ్లే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో భక్తులకు ఉచిత వైద్య సేవలను, ఉచితంగా మందులు మెడికల్ అధికారి రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో అందజేస్తున్నారు.

వాటర్ కూలర్ బహూకరణ

వేలేరు : స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 1985–86వ సంవత్సరంలో పదోతరగతి చదువుకున్న విద్యార్థులు గురువారం హెచ్ఎం రాజన్న ఆధ్వర్యంలో వాటర్ కూలర్ అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రానున్న వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకొని విద్యార్థులు, ఉపాధ్యాయులకు చల్లనీ తాగునీరు అందించాలనే ఉద్దేశంతో రూ. 40వేలు విలువ చేసే వాటర్ కూలర్‌ను అందించినట్లు తెలిపారు. చదువుకున్న పాఠశాలకు తమవంతుగా సాయం అందించడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు చదువుపై దృష్టిసారించి ఉన్నతంగా ఎదగాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పూర్వవిద్యార్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలోకి 'మార్నేని' ని చేర్చుకోవద్దు

ఐనవోలు : కాంగ్రెస్ పార్టీలో వరంగల్ డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావును చేర్చుకోవడానికి మండల నాయకులు అంగీకరించడం లేదని ఆ పార్టీ మండల అధ్యక్షుడు సమ్మెట మహేందర్‌గౌడ్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీలో మార్నేని చేరుతున్నారని, అందుకే ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని ఇటీవల కలిశారని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో గురువారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ప్రతి కార్యకర్త కష్టపడ్డారన్నారు. 20 సంవత్సరాలుగా మార్నేని రవీందర్‌రావు తెలుగుదేశం, బీఆర్ఎస్ పార్టీలో కొనసాగారని, అప్పటి నుంచి కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు మార్నేనితో తీవ్రంగా ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. మార్నేని రవీందర్‌రావు కాంగ్రెస్‌లోకి రావడంపై ఏ ఒక్క కార్యకర్తకు ఇష్టం లేదని అన్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పటికీ ఒడిదుడుకులను తట్టుకుని నిలబడ్డ నిఖార్సైన కార్యకర్తకు అన్యాయం జరుగుతుందని అన్నారు. పది సంవత్సరాలు పదవీ అనుభవించిన మార్నేని తన అక్రమ ఆస్తులను కాపాడుకునేందుకు, పెత్తనం చెలాయించేందుకు కాంగ్రెస్‌లోకి వచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీలోకి ఎట్టి పరిస్థితిలో చేర్చుకోవద్దని మండల పార్టీ తీర్మానం చేసి అధిష్ఠానానికి పంపిస్తున్నట్లు తెలిపారు.

చెరువులో పడి ఇరువురి మృతి



గబ్బెట అనిల్ (ఫైల్)



బర్ల గోపి(ఫైల్)

ఐనవోలు: ప్రమాదవశాత్తు చెరువులో పడి బావ, బామ్మర్ది మృతి చెందిన సంఘటన హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం గర్మిళ్లపెల్లిలో గురువారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, ఎస్సై మహేందర్ కథనం ప్రకారం.. రాంగనర్ గ్రామానికి చెందిన బర్ల రాజు–రాధిక దంపతుల ఇద్దరు కుమారులు శివ, అనిల్ గర్మిళ్లపెల్లిలో తమ మేనత్త లక్ష్మి–బాబు దంపతుల ఇంటికి వచ్చారు. గురువారం ఉదయం గర్మిళ్లపెల్లిలో లక్ష్మి–బాబులకు చెందిన బర్లను మేపడానికి వారి కుమారుడు గబ్బెట అనిల్(28), అల్లుళ్లు బర్ల శివ, బర్ల గోపాల్(గోపి–11)తో కలిసి అడవికి వెళ్లారు. బర్లను కడగడానికి గ్రామంలోని రాంచెరువు వద్దకు బర్రెపైన కూర్చుని వెళ్లారు. నీటిలోకి దిగిన క్రమంలో అదుపుతప్పి చెరువులో పడిపోయారు. శివ ఒడ్డుకు చేరుకోగా ఒకరినొకరు గట్టిగా పట్టుకున్న బావ బామ్మర్ది అనిల్, గోపి నీటిలో ఊపిరాడక మృతిచెందారు. సమాచారం అందించడంతో కుటుంబ సభ్యులు చెరువు వద్దకు చేరుకుని మృతదేహాలను బయటకు తీయించారు. మృతదేహాలను చూసిన కుటుంబ సభ్యులు బోరున విలపించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. జఫర్‌గఢ్ ఎస్సై మహేందర్‌ను వివరణ కోరగా సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు. కుటుంబ సభ్యుల రోదనలు పలువురిని కంటతడి పెట్టించాయి.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పూజలు



ధర్మసాగర్ : మండలంలోని క్యాతంపల్లిలో కొలువైన నవనాగ సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి అర్చకులు గురువారం పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ గంటా పవన్‌శర్మ ఆధ్వర్యంలో గణపతిపూజ, పుణ్యాహవాచనం, మండపారాధన, సుబ్రహ్మణ్య మూలమంత్ర హోమం నిర్వహించి అష్టోత్తర కలశాభిషేకం చేశారు. అనంతరం మహాఅన్నప్రసాద వితరణ చేశారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి ఆశ్లేషబలి కార్యక్రమం, శ్రీవల్లి దేవసేన సమేత, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం, మహా అన్నప్రసాద వితరణ నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ పవన్‌శర్మ తెలిపారు.